ధర్తీ అభ జన్భాగిదరి అభియాన్ పథకం

-జిల్లాలోని గిరిజన గ్రామాలలో ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు అవగాహన శిబిరాలు

-జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

ధర్తీ అభ జన్భాగిదరి అభియాన్ పథకం ద్వారా జిల్లాలోని అన్ని గిరిజన గ్రామాలలో ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు అవగాహన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సదస్సుల్లో ఆధార్ కార్డు, ఆయుష్మాన్‌భవ కార్డు, పిఎం కిసాన్ పథకం ప్రయోజనాలు, జన్‌ధన్ అకౌంట్, స్కాలరిషిప్ కవరేజ్ సంబంధిత సామాజిక భద్రత పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అవగాహన సదస్సులలో గిరిజన ప్రజలు పాల్గొని ఆయా పథకాల ప్రయోజనాలు తెలుసుకొని లబ్ది పొందాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

-బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు బలరాం

రామచంద్రాపురం, జూన్ 10, ప్రభాతవార్త:

విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్నందున ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులను నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని శ్రీ బాలాజీ ఫౌండేషన్ చైర్మన్, భారతీయ జనతా పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం తన నివాసంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రయివేటు విద్యా సంస్థల్లో చదువును వ్యాపారంగా నిర్వహిస్తున్నారని, అడ్మిషన్, స్కూల్ యూనిఫారం, పుస్తకాలు, బూట్లు, టైలు, నెలవారీ ఫీజుల పేరిట తల్లిదండ్రుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, విద్యా సంస్థల్లో మాత్రం కనీస సౌకర్యాలు కానరావని వాపోయారు. విద్యా హక్కు చట్టాన్ని తూట్లు పొడుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బలరాం డిమాండ్ చేశారు.

నూతన మంత్రికి ఘన సత్కారం

సిద్దిపేట అర్బన్,జూన్ 10, ప్రభాతవార్త:

రాష్ట్ర కేబినెట్‌లో నూతన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్ హైదారాబాద్‌నుంచి తన నియోజకవర్గం ధర్మపురికి మంగళవారం వెళ్తుండగా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల దాబాల వద్ద సిద్దిపేటకుచెందిన సీనియర్‌కాంగ్రెస్ నాయకులు నరకుల్ల శివప్ప, గూడూరి శ్రీనివాస్(ఎస్టిడి)లు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి లక్ష్మణ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రభుత్వ కళాశాలల్లో చేరితేనే బంగారు భవిష్యత్తు

-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

సంక్షేమ అధికారులతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంగారెడ్డి బ్యూరో, జూన్ 10, ప్రభాతవార్త:

మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌నందు సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల రామాయంపేట ప్రవేశాల పోస్టర్స్‌ను అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, సంబంధిత డిప్టిక్ట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ శిరీష, సంబంధిత సంక్షేమ అధికారులతో కలిసి కలెక్టర్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికిగాను సాంఘికసంక్షేమ గురుకుల కళాశాల రామాయంపేట మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ పూర్తి చేసుకున్న వారికి ప్రవేశాలకు 60శాతం సోషల్ వెల్ఫేర్ విద్యార్థినులకు, 40శాతం బయట విద్యార్థినులకు ప్రవేశాల కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 8096691184, 9642579305 నెంబర్లకు సంప్రతించాలన్నారు.

భూభారతి చట్టంతో భూసమస్యలు దూరం

-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

పటాన్‌చెరు, జూన్ 10, ప్రభాతవార్త:

నూతన భూభారతి చట్టం అమలుతో ప్రజల భూసమస్యలు దూరమవుతాయని జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. పటాన్‌చెరువు మండలం, రుద్రారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈసందర్భంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు, ప్రజల భూసమస్యల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజల భూసమస్యల దరఖాస్తులను తీసుకొని, వారికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. భూభారతి చట్టాన్ని అనుసరించి ప్రజల భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన వివరాలను రిజిస్టర్లలో అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్)ను పర్యవేక్షించి, పలు వివరాలపై ఆరాతీశారు. జూన్ 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూభారతి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పైశాచిక ఆనందం కోసం కెసిఆర్‌కు నోటీసులు

-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 10, ప్రభాతవార్త:

రైతు బాంధవుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు కాంగ్రెస్‌ప్రభుత్వం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం కోసమే కెసిఆర్, హరీష్‌రావులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం చేతగాక డైవర్షన్ రాజకీయాలుచేస్తూ ప్రజల ఆలోచనలను పక్కదోవ పట్టిస్తున్నట్లు ఆరోపించారు. రేవంత్‌రెడ్డిని అప్పట్లో జైలులో పెట్టినందుకు కక్షగట్టి నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది యావత్ తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రతి అంశాన్ని క్లుప్తంగా రాష్ట్రప్రజలకు తెలియజేశారని, కనీస అవగాహన లేకుండా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం దారుణమన్నారు.

కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు పాండుగౌడ్, సుగుణ దుర్గయ్య, మాజీ జెడ్‌పిటిసి రామచంద్రం, మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు నాగరాజు, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, ఆంజనేయులు, నర్సింగరావు, నరేష్‌గుప్త, సతీష్‌చారి, అహ్మద్, స్వామిచారి, పెద్దంగుల శ్రీనివాస్, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

తండాలో బడిబాట

చిన్నశంకరంపేట, జూన్ 10, ప్రభాతవార్త:

మండల పరిధి కామారం తండాలో స్థానిక ప్రధానోపాధ్యాయులు విజయ, కవితలు ఇంటింటికి తిరుగుతూ బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలని పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులను వివరించారు.

భూ సమస్య కలిగిన ప్రతి ఒక్కరూ అర్జీ పెట్టుకోవాలి

-జిల్లా కలెక్టర్ మను చౌదరి

దుబ్బాక, జూన్ 10, ప్రభాతవార్త:

దుబ్బాక మండలంలోని అప్పనపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సును మంగళవారం జిల్లాకలెక్టర్ మనుచౌదరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసదస్సులో జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ, భూసమస్య కలిగిన ప్రతిఒక్కరూ తమ గ్రామంలో సదస్సు నిర్వహించే రోజున అర్జీ పెట్టుకోవాలని తెలిపారు. భూభారతి సదస్సులో రెవెన్యూ అధికారులకు మీసమస్య ఏదైనాసరే క్లుప్తంగా వివరిస్తే సమస్య ఎలా, ఎప్పుడు, ఎన్నిరోజుల్లో పరిష్కారం అవుతుంది అనే విషయాలను భూభారతి చట్టంలో పొందుపర్చిన అంశాలు అన్నీ తెలియజేసి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు.జిల్లాలో ఈ నెల 20 వరకు నిర్వహిస్తున్న సదస్సుల్లో భూ సమస్య ఉన్న ప్రతిఒక్కరు పాల్గొనాలని తెలిపారు. భూస్వాములతో మాట్లాడుతూ వారి సమస్య విని చట్టప్రకారం అతిత్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూసమస్యకలిగిన ఎవ్వరూ అధైర్యపడవద్దని నూతన ఆర్ఓఆర్ చట్టంలో ప్రతి సమస్యకు పరిష్కారందొరుకుతుందనీ అన్నారు. కలెక్టర్ వెంట డిప్యుటీ తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి...

ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి ఆస్పత్రిడాక్టర్లని ఆదేశించారు.మంగళవారం జిల్లాకలెక్టర్ దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీచేసి ఆసుపత్రిలోని అన్ని వైద్యవిభాగాల రూములను, సంబంధిత వైద్యపరికరాలను పరిశీలించి, వాటి పనితీరును తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీయగా డాక్టర్స్ టైంకు వచ్చి చూస్తున్నారని, అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారని రోగులు తెలిపారు. ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో అన్ని రకాల అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా పేద ప్రజలకు అందిస్తున్నందున ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రజలు ఈ ఆస్పత్రిసేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రసూతి వార్డ్‌ని పరిశీలించి రోజుకు ఎన్ని ప్రసవాలు చేస్తున్నారని, వాటిలో ఎన్ని సాధారణప్రసవాలు జరుగుతున్నాయని తెలుసుకొని సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలు చేయాలని అన్నారు. టాయిలెట్స్‌ను పరిశీలించి ఆస్పత్రిలో ఎంతమంది సానిటేషన్ వర్కర్లు పనిచేస్తున్నారని అడిగి ఆస్పత్రిలో వైద్యంతో పాటు సానిటేషన్ కూడా చాలా ముఖ్యమని సానిటేషన్ కార్యక్రమాలు రెగ్యులర్‌గా నిర్వహించి, ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ నిర్వాహకులను ఆదేశించారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను పరిశీలించి అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఇందులో అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నందున నిర్ణీత సమయంలోగా రక్తపరీక్షలు నిర్వహించి ఫలితాలను అందించాలని అన్నారు. ఆరోగ్యశ్రీ కౌంటర్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చెయ్యాలి. విధుల్లో నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆసుపత్రి సిబ్బందిని హెచ్చరించారు. ఆసుపత్రి వెనకాల ప్రహరీగోడ నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ సమస్య, ఆక్సిజన్ ప్లాంట్ వర్కింగ్ పొసిషన్ లోకి తెచ్చేలా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. అన్ని విభాగాల్లో డాక్టర్లు, నర్సులు ఇతరసిబ్బంది ఆసుపత్రిలో విధులు సక్రమంగా నిర్వహించాలని రోగులకు అందించే వైద్య సేవల కొరకు ఎలాంటి సదుపాయాలైనా కల్పిస్తానని ఏ ఒక్కరోగికి సైతం ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు అందించాలని డాక్టర్స్, ఆసుపత్రి సూపరింటిండెంట్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమ్‌రాజ్‌సింగ్, కిషోర్ కుమార్, ఆయావిభాగాల డాక్టర్లు ఉన్నారు.

భూభారతి రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న కలెక్టర్ చౌదరి

చౌకధర దుకాణంలో అందిస్తున్న సన్నబియ్యాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలి..

మంగళవారం దుబ్బాక మండలంలోని హబ్సీపూర్ గ్రామంలోగల 3809039 నెం. చౌకధర దుకాణంలో, ప్రజాపంపిణీ వ్యవస్థ కింద రేషన్ కార్డుదారులకు, ఒకేసారి మూడు మాసాలు అనగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్నబియ్యం పంపిణీని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పంపిణీ విషయంలో ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. బియ్యంనాణ్యత గురించి ఆరా తీశారు. చౌకధర దుకాణ డీలర్‌ని ఈపాస్ డివైసులో కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్ పని విధానం గురించి, ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడునెలలబియ్యం అంటే జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్న బియ్యంపంపిణీ ఒకేసారి ఈనెలలో జరుగుతుందని, పంపిణీ ఈనెల చివరి తేదీ 30 వరకు జరుగుతుందని కార్డుదారులకు తెలిపారు. పంపిణీ విషయంలో ఎటువంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని సంబంధిత అధికారులను, డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ పౌరసరఫరాల అధికారి, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకి ఇంటర్మీడియట్ అత్యంత కీలకం

-సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

విద్యార్థులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కలెక్టర్ క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్

పటాన్‌చెరు, జూన్ 10, ప్రభాతవార్త:

విద్యార్థి జీవితంలో లక్ష్యం అనేది అత్యంత కీలకమని.. ఇష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదని..చదువు అనే ఆయుధం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సంగారెడ్డి జిల్లాకలెక్టర్ వల్లూరి క్రాంతి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాలులో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి వార్షిక ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ ఘనపరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి జిల్లాకలెక్టర్ వల్లూరి క్రాంతి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కుమార్, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై, పురస్కారాలు పంపిణీ చేశారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాకలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ, పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమప్రతిభ కనబరిచిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపిన వెంటనే సంతోషం వ్యక్తం చేసి, కార్యక్రమానికి హాజరు కావడం జరిగిందని తెలిపారు. తాను విద్యార్థిదశలోనే కలెక్టర్ కావాలన్న లక్ష్యం ఏర్పరచుకొని, అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధంచేసుకుని, లక్ష్యాన్నిసాధించానని విద్యార్థులకు వివరించారు.

లక్ష్య సాధనలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవడంతోపాటు నిరాశానిస్పృహలు సైతం ఎదురయ్యాయని తెలిపారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ అనేది అత్యంత కీలకమని, దీని ఫలితాల ఆధారంగానే మనం ఏం సాధించాలనుకున్నామో స్పష్టత లభిస్తుందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రభుత్వపాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి చేస్తున్న సేవలను ఆమె ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ఇటీవల 30 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సమాజంలోని అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. బీహార్ రాష్ట్రంలోని నిరుపేద కుటుంబం నుండి వచ్చిన తాను ఐపిఎస్ సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థిదశ నుండే ప్రణాళికాబద్ధంగా చదువుతూ లక్ష్యాన్ని సాధించానని తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అత్యధికశాతం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న లక్ష్యంతో గత దశాబ్ద కాలంగా ప్రతి ఏటా పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులచే మోటివేషనల్ తరగతులు నిర్వహించడంతోపాటు పరీక్షల సమయంలో పరీక్ష సామగ్రిని అందిస్తూ వారికి తోడుగా నిలుస్తున్నామని తెలిపారు. పదవతరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు నగదుపురస్కారాలు అందజేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థులకు మొదటిబహుమతి 3వేల రూపాయలు, ద్వితీయ బహుమతి 2వేల రూపాయలు, తృతీయ బహుమతి ఒక వెయ్యి రూపాయల చొప్పున తొమ్మిది లక్షల రూపాయల నగదు పురస్కారాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈసందర్భంగా ప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణులు శ్రీనివాస్ వివిధ అంశాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మాజీ ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థినీవిద్యార్థులు తదితరులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ మెరుగ్గా ఉండాలి

-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి బ్యూరో, జూన్ 10, ప్రభాతవార్త:

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వివిధ సంక్షేమహాస్టల్స్, కెజిబివిలు, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ మరింతమెరుగ్గా సమర్థవంతంగా ఉండాలని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌నందు వివిధసంక్షేమ హాస్టల్స్ ప్రిన్సిపల్స్, కెజిబివి ప్రత్యేక అధికారులు, వార్డెన్స్‌తో 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, కెజిబివిలు, రెసిడెన్షియల్ పాఠశాలల సమర్థనిర్వహణకు కలెక్టర్ సూచనచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈవిద్యా సంవత్సరం ప్రభుత్వ సంక్షేమహాస్టల్స్ మరింత మెరుగ్గా నిర్వహించేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో సంక్షేమహాస్టల్స్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించినప్పుడు సంక్షేమ హాస్టల్ నిర్వాహకులు విద్యార్థినీవిద్యార్థులకు నాణ్యమైనమెనూ అందిస్తూ పరిశుభ్రమైనఆహారం అందించడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. ఈసంవత్సరం ప్రభుత్వ విద్యా సంస్థల్లో సమర్థ నిర్వహణకు దిశానిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు.ప్రతివిద్యాసంస్థల్లో టీచింగ్ నాన్ టీచింగ్, ఉపాధ్యాయులు, కుక్, కమాటీలతో సమావేశాలు నిర్వహించుకుని చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో బుష్ క్లియరెన్స్ చేపట్టాలని, మరుగుదొడ్ల పరిశుభ్రతతో పాటు తప్పనిసరిగా లైట్స్ ఉండాలని, విద్యార్థులతో ఎవరూ ఇతరపనులు చేయించవద్దని, నాణ్యమైన గుణాత్మకవిద్య, అందించడంతోపాటు మానసిక శారీరక, దృఢత్వానికి ఆసక్తికరమైన క్రీడలు మీద విద్యార్థినీవిద్యార్థులు మొగ్గు చూపేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సురక్షితమైన ఆహారాన్ని సిద్ధం చేయడానికి, కుక్, కమాటీలు, వంటచేసేసిబ్బంది తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వంటగది పరిశుభ్రత అనేది వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడానికి చాలా ముఖ్యం అని తెలిపారు. వంటచేసే సిబ్బందికి తప్పనిసరిగా టీహబ్ సమన్వయంతో ఆరోగ్య పరీక్షలునిర్వహించాలని అన్నారు. కాలంచెల్లిన వంటవండే నిత్యావసర వస్తువులు ఎట్టి పరిస్థితుల్లో వాడవద్దని తెలిపారు. వంటవండటం, ఆహార నాణ్యతలను టెస్ట్‌చేసేవిధంగా ఫుడ్‌కమిటీలు చర్యలు తీసుకోవాలన్నారు. పేరెంట్ టీచర్స్ సమావేశాలు నిర్వహించినప్పుడు వారితో సమన్వయంగా మెలగాలని ప్రభుత్వ విద్యాబోధనపై పిల్లల సత్ప్రవర్తనపై చర్చించుకొని తద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వసంక్షేమ రెసిడెన్షియల్ కెజిబివిలలో సిసిటివి కెమెరాల అమరిక పూర్తయిందని పటిష్టపర్యవేక్షణకు కలెక్టరేట్ కార్యాలయం ద్వారా మానిటరింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఇంటర్నెట్‌సౌకర్యం మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వహించేటప్పుడు సంబంధిత అధికారులు నిరక్ష్యధోరణితో వ్యవహరిస్తే, కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రౌండ్‌బేస్ లెర్నింగ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆర్‌బిఎస్‌కె క్లీనింగ్ వైద్యపరీక్షలు పిల్లలందరికీ చేయించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఇఓ రాధాకిషన్, గిరిజనసంక్షేమ అధికారిణి నీలిమ, ఎస్సీ సంక్షేమ అధికారిణి శశికళ, బిసి సంక్షేమ అధికారి జగదీష్, మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లానాయక్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, ప్రభుత్వసంస్థల ప్రిన్సిపల్స్, కెజిబివి ప్రత్యేక అధికారులు, వార్డెన్స్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఘనపూర్‌లో వ్యక్తి దారుణహత్య

-ఆస్తి తగాదాలతో పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం

-తమ్ముడు కొడుకే నిందితుడు

-ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

పటాన్‌చెరు, జూన్ 10, ప్రభాతవార్త:

ఆస్తి తగాదాలతో పెదనాన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించాడో యువకుడు. బాధితుడు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. బిడిఎల్ సిఐ స్వామిగౌడ్ అందించిన కథనం ప్రకారం బిడిఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘనాపూర్ గ్రామానికి చెందిన చెర్ల రాములు (55) రామచంద్రపురంలో నివాసం ఉంటున్నాడు. రాములు సోదరుడు క్రిష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అతని భార్య, కుమారులు ఘనపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఇంటిలో తనవాటా కోసం రాములు ఈనెల 4వ తేదీన ఘనపూర్ రావటంతో అన్న కుమారుడు దిలీప్(18)తో గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన దిలీప్ రాములుపై దాడిచేసి ఒంటిపై పెట్రోల్‌పోసి నిప్పంటించాడు. మద్యంమత్తులో ఉన్న రాములు అతని బారినుండి తప్పించుకోలేకపోవడంతో దాదాపు 50శాతం కాలిపోయాడు. వెంటనే అతన్ని స్థానికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి రాములు మృతిచెందాడు. ఈ మేరకు బిడిఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు : దానం నాగేందర్

పిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నాగభూషణంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్, జూన్ 10 ప్రభాతవార్త

టీపిసిసి ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన నాగభూషణంను మంగళవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు తప్పక లభిస్తుందని తెలిపారు. అనంతరం పిసిసి ప్రధాన కార్యదర్శగా నియమితులైన నాగభూషణం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకంతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రతిష్టత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి లక్పతి యాదగిరిగౌడ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, వికాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా జగదీశ్వర్ నియామకం

-పార్టీకి విధేయుడిగా ఉంటూ పనిచేస్తా

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బడుగు, బలహీనవర్గాల ప్రముఖుడు సంగిశెట్టి జగదీశ్వర్ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీకి అంకితమైన జగదీశ్వర్ గతంలో కూడా టిపిసిసి కార్యవర్గంలో రాష్ట్ర స్థాయిలో విశేషంగా సేవలందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా కూడా పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ తనకు ఏ బాధ్యతను అప్పగిస్తే ఆ బాధ్యతకు న్యాయం చేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. మంగళవారం చిక్కడపల్లిలో సంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన ఈ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించడంతో పాటు, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకునే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆస్పత్రి శుభ్రతకు ప్రజలు సహకరించాలి

- గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్

నూతన టాయిలెట్స్ బ్లాక్ ప్రారంభించిన డాక్టర్ రాజకుమారి

సికింద్రాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:

రోగులు, వారి సహాయకుల కోసం ఆధునీకరించిన నూతన టాయిలెట్ బ్లాక్‌ను గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి ప్రారంభించారు. ప్రధాన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్, ఎనిమిది అంతస్తులతో పాటు అన్ని వార్డులో సుమారు 500 పైగా పాత టాయిలెట్‌లను సమూలంగా మార్చినట్లు ఆమె తెలిపారు. శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మార్చడానికి పనులు వేగంగా జరుగుతున్నాయని ఆమె అన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది 24 గంటలు పని చేస్తుంటారని, ప్రజలు కూడా బాధ్యతగా పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడానికి సహకరించాలని ఆమె కోరారు. దవాఖానకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నామని అన్నారు. తాగునీటి సరఫరా కోసం అన్ని రకాల చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆర్ఎంఓలు డాక్టర్ యోగేందర్, డాక్టర్ నవీన్, టీజీఎంఎస్ఐడీసీ డిప్యూటీ ఈఈ అనిల్ కుమార్, ఏఈ భీమన్న, ఇంచార్జీ జగదీష్ ప్రసాద్ పాల్గొన్నారు.

27న మహిళలకు మార్గదర్శకమైన దేవి లాంచ్

లోను ఆవిష్కరిస్తున్న సినీనటి ఐశ్వర్య రాజేష్, యాంకర్ సుమ తదితరులు

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: మహిళల మార్గదర్శక సమూహం అయిన దేవి (డిఈడబ్ల్యూఐ-డైనమిక్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఉమన్ ఇన్నోవేటర్) లోగోను సినీనటి ఐశ్వర్య రాజేష్, ప్రముఖ యాంకర్ సుమ కనకాల మంగళవారం నాడిక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సలహారులు మడిపడిగె రాజు, వైస్-ఛైర్‌పర్సన్ డా.కళ్యాణి గుడుగుంట్ల, వ్యవస్థాపకులు డా.కొల్లి సౌమ్య మాట్లాడుతూ డాక్టర్ వేముల నీలిమ చేత స్థాపంచబడ్డ ఈ సంస్థ, ఎపెక్స్ ఛైర్ పర్సన్ సద్యవతి ప్రసన్న మదిపడిగె (ఎంఎంఎన్-మీటింగ్ మిలియన్స్ నెట్ వర్క్ మార్గదర్శకంలో రూపుదిద్దుకున్నదన్నారు. వివిధ వృత్తి పరమైన వ్యాపార నేపథ్యాల నుంచి వచ్చిన మహిళలు కనెక్ట్ అవడానికి సహకరించడానికి వృద్ధి చెందడానికి ఒక బలమైన వేదికను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వివిధ వృత్తుల నుంచి వచ్చిన మహిళలందరికి దేవి సభ్యత్వం అందుబాటులో ఉంటుందన్నారు. దేవి అధికారిక గ్రాండ్ లాంచ్ ప్రముఖుల సమక్షంలో ఈ నెల 27న 108 వ్యవస్థాపక సభ్యుల సమక్షంలో జరుగుతుందన్నారు. ఆసక్తి గల మహిళలు 9885 657619, 93933 93633లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్, జూన్ 10, ప్రభాతవార్త : విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలియజేశారు. 11కేవీ బి.వి.ఆర్.ఐ.టి ఫీడర్‌లో నేడు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు సత్యం వ్యాలీ, సత్యం హైట్స్, బి.వి.ఆర్.ఐ.టి కళాశాల, పూజిత లేఅవుట్ ప్రాంతాలు. 11 కేవీ జిపిఆర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు జీపీఆర్ కాలనీ, విజయ దుర్గ కాలనీ, ఐడిపిఎల్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు. ప్రశాంతి హిల్స్ సబ్ స్టేషన్ లో..11కేవీ న్యూ శ్రీనివాస కాలనీ ఫీడర్, 11కేవీ పాండురంగ ఫీడర్‌లలో నేడు ఉదయం 9 నుండి 12 గంటల వరకు సర్వే నెంబర్ 191, ఎన్టీఆర్ నగర్, శ్రీనివాస కాలనీ, ఆదిత్య సరస్సు, తిరుసంకల్ప్, శ్రీ బాలాజీ, లేక్‌బ్రిడ్జ్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు నిజాంపేట ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు.

దళితుల కోసం పోరాటం చేసిన మహనీయుడు కుసుమ ధర్మన్న

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త: వివక్షత ఎదుర్కొంటున్న దళితుల కోసమే కాక సమాజంలో వున్న పలు రుగ్మతల పై అవిశ్రాంతంగా పోరాడిన గొప్ప వ్యక్తి కుసుమ ధర్మన్న అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం ఎందరో మహానుభావులు మధురస్మృతులలో భాగంగా తొలి దళిత కవి, వ్యాసకర్త, ఉద్యమకారుడు కుసుమ ధర్మన్న యాదిలో కార్యక్రమం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి.ఎస్.జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిధిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్క మాట్లాడుతూ రాజ్యంగ నిర్మాత అంబేద్కర్ ను తెలుగు వారికి పరిచయం చేసిన ధర్మన్న గాంధీ అనుచరుడు ఐనప్పటికీ దళుతుల విషయంలో రాజీ పడలేదని చెప్పారు. తెలంగాణ ప్రాంతం భాగ్య రెడ్డి వర్మతో కలసి హైదరాబాద్ నగరంలో పలు ఉద్యమ సభలు జరిపారని గుర్తు చేసుకున్నారు. అయన రచించిన ఖిమా కొద్దీ నల్ల దొర తనంఖీ నాటి సమాజ పరిస్థితికి దర్పణం అన్నారు. అంటరాని తనం పోయినప్పుడే నిజమైన స్వాతంత్రం అని ధర్మన్న చెప్పేవారని, అయన

ప్రసంగిస్తున్న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్

ఆశయం నేటికీ నెరవేరలేదనీ, నేటికీ వివక్షత దేశంలో కొన్ని ప్రాంతాలలో వుందని అవేదన వెలిబుచ్చారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న రచనలు తక్కువ చేసినా సమాజాన్ని ప్రభావితం చేశాయని అయన జీవిత కథ సిలబస్‌లో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, సినీ నటుడు మాణిక్, గాయని గరిమెళ్ళ సీత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కోసం పోరాటం చేసిన వారికి పదవులు దక్కటం లేదు

-మాజీ ఎంపి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్

ముషీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర క్యాబినేట్‌లో తెలంగాణ కోసం పోరాటం చేసిన వారికి పదవులు దక్కలేదని, ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తులు, ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారు పదవులు అనుభవిస్తున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం కవాడిగూడలోని బండమైసమ్మ కమ్యూనిటీహాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పుడున్న మంత్రులను చూస్తే బాధగా ఉందని, నిన్న ప్రకటించిన టీపీసీసీ కమిటీ జాబితాలో కూడా కష్టపడ్డ వారికి కాకుండా కొత్త వారికి అవకాశం కల్పించి, అన్యాయం చేశారని ఆరోపించారు. 2023 సాధారణ ఎన్నికలలో ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపుకోసం కర్ణాటక సీఎం సిద్దిరామయ్య, డిప్యూటి సీఎం డి.కె.శివకుమార్‌లు వచ్చి ప్రచారం చేసినప్పటికీ ముషీరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే క్యాబినేట్‌లో మంత్రి పదవి వచ్చి ఉండేదని, అనునిత్యం ముషీరాబాద్ ప్రజలకు అందుబాటులో ఉండేవాడినని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గానికి రావాలంటేనే ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాబోయే గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. టీపీసీసీ రాష్ట్ర పరిశీలకులు రాచమల్ల సిద్ధేశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. కష్టపడే వారికి కార్పోరేటర్ టిక్కెట్‌లతో పాటు నామినేటెడ్ పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. కార్యకర్తలు ఎవరూ నిరాశకు గురికాకుండా పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కల్పనాయాదవ్, రమేష్, మాజీ కార్పోరేటర్ వాజిద్‌హుస్సేన్, నేతలు చంద్రశేఖర్, ప్రభాకర్, అభిషేక్ కెనడి, సాయిబాబా, అంజియాదవ్, మేడి సురేష్, మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మారిశెట్టి నర్సింగ్ రావు, ధర్మేందర్, డివిజన్ అధ్యక్షులు భాస్కర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

విద్యార్థి వ్యతిరేక బస్‌పాస్ చార్జీల పెంపును ఉపసరించుకోవాలి

హైదరాబాద్ జూన్ 10 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెంచిన టిజిఎస్ఆర్‌టిసి బస్ పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఏఐడిఎస్ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వవి.నాగరాజు డిమాండ్ చేశారు. బస్ పాస్ చార్జీల పేరుతో విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్న ఆర్టీసీ వైఖరి నశించాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆందోళన చేపట్టింది. విద్యార్థుల బస్ పాస్ చార్జీలపై 50 పెంపును విధించిన టిజిఎస్ఆర్‌టిసి విద్యార్థి వ్యతిరేక నిర్ణయాన్ని ఏఐడిఎస్ఓ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే అనేక ఆర్థిక సమస్యలతో చదువును నెట్టుకొస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని, 2022 సంవత్సరం కన్నా ముందు నెలకు ..రూ.150 నుంచి రూ.190 మధ్యలో ఉన్న విద్యార్థి బస్ పాస్ ధరను 2022 సంవత్సరంలో రూ.450కి అన్యాయంగా పెంచడం జరిగిందని, ఇప్పుడు దాన్ని మరింత పెంచుతూ రూ.600కు చేర్చడం అనేది పూర్తిగా పేద విద్యార్థులపై పట్టింపు లేని చర్య అని విమర్శించారు. ఇప్పటికే బస్ పాస్ చార్జీలు సమకూర్చుకోలేక ఎంతోమంది విద్యార్థులు వారి కళాశాలలకు వెళ్లలేని పరిస్థితి ఉందని, ఇప్పుడు అది మరింత పెరుగుతుందని, చార్జీలను పెంచేటప్పుడు ప్రజాస్వామ్యయుతంగా ప్రజాసంఘాలు,విద్యార్థి సంఘాలు తదితరుల అభిప్రాయాలు తీసుకోవడం సరైన పద్ధతి అని, . అలాకాకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ఖండించాల్సిన విషయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మంది విద్యార్థులపై, నగరవ్యాప్తంగా 2.5 లక్షల మంది ప్రజలపై ప్రభావం చూపించే నిర్ణయాన్ని ఎంతో జాగ్రత్త తీసుకోవాల్సి ఉండగా అలా చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. బస్ పాస్ తో పాటు సర్వీస్ ఛార్జ్ రూ.30, లేట్ అయినప్పుడు లేట్ ఫీ తీసుకున్నప్పటికీ పాస్ లో రోజుల సంఖ్యను తగ్గించడం జరుగుతుంది. ఇవన్నీ విద్యార్థులపై అధిక భారాలేనని అన్నారు.

ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకొని ప్రజలు, విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గిస్తూ సరసమైన ధరలను అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఉద్యమానికి విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు సామాన్య ప్రజలు అన్ని విధాల సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసిన కాంగ్రెస్ నాయకులు పులిపాటి రాజేష్ కుమార్,కె.రవి రాజ్

చార్మినార్,జూన్ 10 ప్రభాతవార్త : ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా పాతబస్తీలోని అన్ని దేవాలయాలతో పాటు బహదూర్‌పుర నియోజకవర్గంలోని దేవాలయాలలో ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్, యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.రవిరాజ్‌లు కోరారు.పాతబస్తీలోని అన్ని చిన్న దేవాలయాలకు ప్రభుత్వం ద్వారా ఇచ్చే బోనాల నిధులను పది శాతం పెంచాలని వారు మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు



కార్యక్రమంలో పాల్గొన్న చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నగేష్,కాంగ్రెస్ నాయకులు

చార్మినార్,జూన్ 10 ప్రభాతవార్త :

పాతబస్తీ చాంద్రాయణగుట్ట నల్లవాగు శ్మశాన వాటికలో 11 లక్షల రూపాయల 50 వేల రూపాయల వ్యయంతో కొత్తగా నిర్మించిన స్నానపు గదులను మంగళవారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ బోయ నగేష్,కాంగ్రెస్ ఓబిసి సెల్ నగర ఉపాధ్యక్షులు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లవాగు శ్మశాన వాటిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.కార్యక్రమంలో భాగ్యనగర్ బ్యాగరి సంఘం అధ్యక్షులు పేరోజి సాయినాథ్, ప్రతినిధులు సాయిలు,ప్రదీప్, వీరేందర్, జయలక్ష్మీ, జయమ్మ,అజయ్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కెసిఆర్‌కు మద్దతుగా భారీ ఎత్తున కార్యకర్తలు తరలిరావాలి

- నార్సింగి మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి

నార్సింగి, జూన్ 10 ప్రభాతవార్త :

బుధవారం కాళేశ్వరం కమీషన్ ముందు హాజరవుతున్న బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నార్సింగి మున్సిపల్ నుంచి నేతలు, కార్యకర్తలు బిఆర్‌కే భవన్ వద్దకు పెద్ద ఎత్తున తరళి రావాలని అధ్యక్షులు కే.విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ పేరు ఎత్తేందుకే భయపడే రోజుల్లో, పిడికెడు మందితో టిఆర్ఎస్‌ను స్థాపించి 14. ఏళ్లపాటు ఉధృతంగా ఉద్యమాన్ని నడిపారని, వలస పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారన్నారు. చావు నోట్లో తలపెట్టి కేంద్రంతో తెలంగాణ ప్రకటన చేయించిన నేత కేసీఆర్ అని తెలిపారు. దేశంలోని అన్ని పార్టీల నేతలను ఒప్పించి, తెలంగాణ రాష్ట్రంను సాధించుకు వచ్చారని, పదేళ్లపాటు తెలంగాణ సీఎంగా పని చేసి తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన కట్టించి కోటి ఎకరాలకు నీటిని సరఫరా చేయించారన్నారు. ఇంతటి ఘనతను సాధించిన కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలతో విచారణకు పిలువడం అవమానకరమన్నారు. కేసీఆర్‌కు తెలంగాణ మొత్తం అండగా నిలబడాల్సిన అవసరం ఉందని విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు..

శ్రీ రేణుక అమ్మవారి అభిషేకం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

పేట్ బషీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త

జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎంక్లేవ్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఈనెల 21 శనివారం పూజలతో ప్రారంభమై, 22 ఆదివారం రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ తీర్మానం చేశారు. ఈ రెండు రోజులపాటు జరిగే ఏర్పాట్లపై కమిటీని ఎంపిక చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేష్ గౌడ్, చంద్రశేఖర్, రాకేష్ కుమార్, భాగ్యలత, అనురాధ, రాధిక, గీతా సింగ్, హరిని, అవని, సంగీత, రేఖ, సునీత, గాయత్రి, కవిత తదితరులు పాల్గొన్నారు.

నేటికీ భజనలు పద్యాలు భగవద్గీతశ్లోకాలు నేర్చుకునే వారుండడం అదృష్టమే

-కళారత్న సురభి ఆర్.వేణుగోపాల్‌రావు

రవీంద్రభారతి, జూన్ 10 ప్రభాతవార్త : నేటితరానికి రామాయణం, భారతం భాగవతం, చక్రవర్తులు, చరిత్ర అంటే ఏమిటో తెలియని కనుమరుగై పోతున్న తరుణంలో కేవలం శాస్త్రీయ నృత్యాలేకాక భజనలు, పద్యాలు, భగవద్గీత శ్లోకాలు చిన్నారులకు నేర్పించడం అమోఘం హర్షదాయకమని గురువులను అభినందించిన కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారస్వీకరక్త, కళారత్న సురభి ఆర్.వేణుగోపాల్‌రావు శివానందలహరి సంస్థ గురువు కె.యశశ్రీ అద్భుతమైన శాస్త్రీయ నృత్యశిక్షణ క్రమ వారి శిష్యుల్లో ప్రస్ఫుటమౌతుందని, చిన్నపిల్లలకు శిక్షణ ఇవ్వడం కష్టతరం కత్తిమీద సాములాంటిదని అన్నారు. ఇలాంటివి పిల్లలకు చెప్పే గురువులు నేర్చుకునే పిల్లలున్నారా అనిపిస్తుందని, ఈరోజుల్లో నేర్పించే మంచి గురువులు, శ్రద్ధగా అభ్యసించే శిష్యులు వారిని ప్రోత్సహించే తల్లిదండ్రులు దొరకడం కూడా చాలా కష్టం... అదృష్టమని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను, సంప్రదాయాన్ని కొనసాగిస్తే మన కళలు ముందుతరాలకు తెలియడంతోపాటు నాలుగుకాలాలపాటు జీవిస్తాయని, మంచిరోజులొస్తాయని ఆకాంక్షించారు. ఇవన్నీ కనుమరుగు కాకుండా కాపాడాలని అందరినీ కోరారు. ప్రముఖ అకాడమీ ఆఫ్ డాన్స్, మ్యూజిక్, ఫైన్‌ఆర్ట్స్ సంస్థ శివానందలహరి విద్యార్థులను అత్యుత్తమ కళాకారులుగా తీర్చిదిద్ది భారతీయ కళాసంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడంలో అందెవేసిన చెయ్యని కొనియాడుతూ సంస్థ గురువుల కళాసేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాకారులు తమ శాస్త్రీయ నృత్యప్రదర్శనలను ముందుగా గణేశ భజనతో ప్రారంభించి పుష్పాంజలి నృత్యం, ముకుంద ముకుంద, సరస్వతీదేవి స్తుతిగీతం, నటేషకౌత్వం, జతిస్వరం, భగవద్గీత శ్లోకాలు, స్వాగతం కృష్ణా, తిల్లానా తదితర అశాలను, చివరిగా మంగళం అద్భుతంగా ప్రదర్శించి విచ్చేసిన అశేషప్రేక్షకుల, కళాప్రియులను మైమరపించి శుభాశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర సంగీత నాటకఅకాడమీ అవార్డుగ్రహీత సురభి ఆర్.వేణుగోపాల్ రావు, గౌరవ అతిథులు డా. ఎం.జపమాలరాణి, గురు శ్యామల శ్రీనివాస్, కె.జయశ్రీ, సంస్థ అధ్యక్షుడు బి.వివేకానంద(రాజు), బి.జ్యోతి, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులతో కలిసి విద్యార్థులకు శాస్త్రీయ నృత్యపరీక్షల ధృవపత్రాలను, జ్ఞాపికలను ప్రదానం చేసి శుభాశీస్సులు అందజేశారు.

సభలో ప్రసంగిస్తున్న వేణుగోపాల్‌రావు, జపమాలరాణి, శ్యామల, శ్రీనివాస్, శ్రీధర్, వివేకానందం, జయశ్రీ తదితర అతిథులు

సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ వేగంగా అభివృద్ధి : ప్రకాశ్‌గౌడ్

- అభివృద్ధికి ఆకర్షితురాలై కాంగ్రెస్‌లో చేరిన సినీనటి మధుకృష్ణ

నార్సింగి, జూన్ 10 ప్రభాతవార్త :

సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మణికొండ ప్రాంతంలో నివాసముంటున్న ప్రముఖ సినీనటి మధుకృష్ణ తన అనుచరగణంతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మధుకృష్ణకు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. భారతదేశంలో ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసిన ఏకైక సర్కారు తెలంగాణ అని స్పష్టం చేశారు. రైతులు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, మహిళలు ఇలా అన్ని రంగాల వారికి లబ్ధి చేకూరే సంక్షేమ పతకాలు సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వ్యవస్థలను గాడిన పెట్టి, అభివృద్ధి-సంక్షేమాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏడాదిన్నర పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున మేధావులు, ఇతర పార్టీల నాయకులు, సినీ ప్రముఖులు, యువకులు చేరుతున్నారన్నారు. అనంతరం సినీనటి మధుకృష్ణ మాట్లాడుతూ తెలంగాణతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే నేను కాంగ్రెస్ పార్టీలో చేరడం జరుగుతుందన్నారు. వ

దత్తగిరిలో పూసిన బ్రహ్మకమలం

-పూజలు చేసిన పీఠాధిపతులు

ఝరాసంగం, జూన్ 10, ప్రభాతవార్త:

మండలపరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీదత్తగిరి ఆశ్రమంలో హిమాలయపర్వత ప్రాంతాల్లో ఏడాదికి ఒకమారు పూసే బ్రహ్మకమలం పూసింది. మంగళవారం వికసించిన బ్రహ్మ కమలాన్ని ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ (అప్పగారు), డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్‌లు గ్రామభక్తులతో కలిసి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పూసిన బ్రహ్మ కమలాలతో ఆశ్రమంలోని దత్తాత్రేయస్వామి పాదాలు, జ్యోతిర్లింగాల మండపంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలో బ్రహ్మకమలం పూసినట్లు తెలుసుకున్న బర్దీపూర్ గ్రామస్థులు పెద్ద ఎత్తున ఆశ్రమానికి చేరుకుని కమలాన్ని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఫోటో/కొండపాక,2=కుకునూరుపల్లి బజరంగ్‌దళ్ నూతన కమిటీ ఎన్నిక

గోహత్యలను బజరంగ్‌దళ్ సైనికుల్లా ఎదుర్కోవాలి

కొండపాక, జూన్ 10, ప్రభాతవార్త:

దేశంలో జరుగుతున్న గోహత్య, హిందువులపై దాడులను ఎదుర్కొనుటకు విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు సైనికుల పని చేయాలని విశ్వహిందూ పరిషత్ సిద్దపేట జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో బజరంగ్‌దళ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అయన పాల్గొని మాట్లాడుతూ మండల కమిటీ సంయోజక్‌గా కొంతం రాజు, సహాయ సంయోజక్‌గా బోయిని నర్సింలు, రాజు, మహేష్‌లను నియమించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రెసిడెంట్ మల్లేశం, నాయకులు నందకిషోర్, మురళిమోహన్, హరిష్, పాండురంగం, బండారు మహేష్, ప్రముఖుల రాజు, ఇండ్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మెదక్ పట్టణ సిఐగా మహేష్...

-సిఐ నాగరాజు బదిలీ...

సంగారెడ్డి బ్యూరో, జూన్ 10, ప్రభాతవార్త:

మెదక్ పట్టణ సిఐ నాగరాజు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ కాగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఐజీ కార్యాలయంకు అటాచ్ ఉండగా మెదక్ సిఐగా బదిలీపైన వచ్చారు. ఇప్పటివరకు పట్టణం సిఐ బాధ్యతలు నిర్వహించిన నాగరాజును ఐజి కార్యాలయంకు అటాచ్ చేశారు. ఏడాది క్రితమే బాధ్యతలు చేపట్టిన నాగరాజు పట్టణంలో పలు చర్యలు చేపట్టారు. ఇసుక, మట్టి వ్యాపారంపై ఉక్కుపాదం మోపారు. నిజాయితీని నమ్ముకుని విధులు నిర్వహించిన సిఐ బదిఈ కావడంపై సర్వత్ర చర్చ సాగుతుంది. కనీసం రెండేళ్లు పూర్తి కాకుండానే బదిలీ కావడం వెనక మాఫియా సిండికేట్ హస్తం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. సిఐ విధులు నిర్వహించిన నాగరాజుకు పట్టణం పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

ఆయుష్ ఆధ్వర్యంలో హరిత యోగ

రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 10, ప్రభాతవార్త:

రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా హరిత యోగ కార్యక్రమం చేపట్టారు. మంగళవారం నాడు స్థానిక రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం యోగా శిక్షకులు మద్దెల భరత్ మాట్లాడుతూ యోగ విశిష్టతను తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మితో పాటు మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

భూసార పరీక్షలతో మంచి ప్రయోజనాలు

పాపన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త:

రైతులు తమ భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు మహేంద్ర కుమార్, అంబికసోనీలు అన్నారు. వికసితసంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలపరిధి ఎల్లాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి పంటకు మొదలు మట్టి పరీక్షలు నిర్వహించడం ద్వారా భూమిలో పోషకాలను బట్టి ఏ మేరకు ఎరువులు వాడాలో తెలుస్తుందన్నారు. సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ విధానాలను గురించి వివరించారు. ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కొత్త వరి వంగడాలు, పంటను రక్షించే నివారణ మార్గాలను తెలియజేశారు. శాస్త్రవేత్తలు మహేంద్రకుమార్, ప్రసాద్, సాయిప్రసాద్, చిన్నబాబు, రవికుమార్, ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ అంబికాసోని, ఏడీఏ విజయనిర్మల, ఏవో నాగమాధురి, ఏఈవోలు అభిలాష్, జనార్ధన్, రజిత తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి...

-జిల్లా వైద్యాధికారి శ్రీరాం

పాపన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త ః

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం అన్నారు. మంగళవారం మండల పరిధి పొద్చన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో సరిపడ మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలు రికార్డులు పరిశీలించారు. సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి హరిప్రసాద్, వైద్యులు దీక్షా, ప్రదీప్, సూపర్‌వైజర్ అలీ, ఏఎన్ఎంలు, తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

-మొక్కలు నాటిన బిజెపి నాయకులు

పల్లెపహాడ్‌లో మొక్కలు నాటుతున్న బిజెపి నాయకులు

గజ్వేల్, జూన్ 10, ప్రభాతవార్త:

ప్రపంచ పర్యావరణ దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మన దేశ ప్రధాని నరేంద్రమోడి పిలుపు మేరకు మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్‌లో బిజెపి పట్టణ కార్యదర్శి మాడ్గురి నర్సింహాముదిరాజ్ మాతృమూర్తి లక్ష్మమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మాడ్గురి నర్సింహా మాట్లాడుతూ జాతీయ వన మహోత్సవం సందర్భంలో ప్రధాని మాటలు, వారి స్ఫూర్తితో మేము సైతం మొక్కలు నాటడం జరిగిందని, సమిష్టి కృషితోనే పర్యావరణ సంరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి ప్రసాద్, మైస విజయ్‌కుమార్, యువ మోర్చా నాయకులు రాజేశ్వర్‌చారి, సుందరి రాజు, బూత్ అధ్యక్షులు గుప్తా రామకృష్ణ, మహిళా మోర్చా నాయకులు శివలింగం వినోద తదితరులు పాల్గొన్నారు.

మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

చిన్నశంకరంపేట, జూన్ 10, ప్రభాతవార్త:

మండలపరిధి జంగరాయిగ్రామంలో మంగళవారం మెడిసిటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచితవైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో సుమారు 200మందికి పైగా గ్రామస్తులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. గ్రామంలో 60 మందిని ఆసుపత్రికి తరలించి మెడిసిటి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈశిబిరంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ బందెల ప్రభాకర్, వెన్నెల, సిద్దిరాములు, విఠల్, వైద్యులు కార్తీక్, శృతిక, వర్ష, లావణ్య, మార్కెటింగ్ ఇంచార్జి సంజయ్, నాగార్జున రాకేష్, రాజు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

-గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

గజ్వేల్ టౌన్, జూన్ 10, ప్రభాతవార్త:

రాష్ట్రంలో సామాజిక న్యాయం పాటిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల మెప్పు పొందుతున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దళితులు, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తుండగా ఇందుకు ఇటీవల ఏర్పాటుచేసిన మంత్రివర్గం, పిసిసి కార్యవర్గాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో ఒకటి రెండు శాతం ఉన్న కులాలకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇవ్వగా, అందుకు భిన్నంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు దళితులు, బిసిలకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. అంతేకాకుండా చారిత్రాత్మక నిర్ణయాలతో పేద ప్రజల మన్ననలు పొందుతున్న సిఎం రేవంత్‌రెడ్డి మరింత ఉత్సాహంతో కొత్త కొత్త పథకాలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. పంట రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం, ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను సిఎం రేవంత్‌రెడ్డి బయట పెడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని జీర్ణించుకోలేక కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు, కవితలు కొత్త కొత్త డ్రామాలకు తెరలేపుతున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నో ఆశలతో నమ్మి ఓటు వేసిన గజ్వేల్ ప్రజలకు అందుబాటులోకి రాని కెసిఆర్ తన పార్టీ ఎమ్మెల్యే చనిపోతే మాత్రం పరామర్శకు వెళ్ళినట్లు వివరించారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరం

-జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త:

స్వయం సహాయక సంఘాలు ఆర్థిక సామాజిక లావాదేవీలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని రామచంద్రపురం గ్రామైక్య సంఘ సమావేశానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడారు. మాట్లాడుతూ గ్రామంలోని సంఘాలు ప్రతి నెల క్రమం తప్పకుండా జరిపే ఇలాంటి గ్రామైక్య సంఘసమావేశాలు ఆర్థిక పారదర్శకతలో భాగంగా అన్ని సంఘాలు ప్రతినెల గ్రామైక్య సంఘం లో జరిగే అన్ని ఆర్థిక మరియు సామాజిక లావాదేవీలపై పూర్తి అవగాహన కలిగి ఉండి ప్రతి నెల గత సమావేశాలపై సమీక్ష జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ఎంపీడీవో మధులత హాజరై సభ్యులందరికీ తడిచెత్త పొడిచెత్త వేరు చేయడం, ప్రతి మహిళ ఒక మొక్క నాటుకొని దాన్ని కాపాడుకోవాలని, ఉపాధి హామీలో ప్రతి ఒక్కరు పని చేస్తూ లబ్ధి పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం మార్గం. గౌరీ శంకర్, సీసీ దేవి సింగ్, కార్యదర్శి, సిఏ నీరజ, గ్రామ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కొండయ్య కుంటభూములను రెగ్యులరైజ్ చేయాలని వినతిపత్రం అందజేత

శివ్వంపేట, జూన్ 10, ప్రభాతవార్త:

కొండయ్య కుంట భూములను రెగ్యులరైజ్ చేయాలని రెవెన్యూ సదస్సులో అశోక్ సాదుల డిప్యూటీ తహసిల్దార్ మహమ్మద్ షఫీ యోద్దీన్ కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని ఉసిరిక పల్లి గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని ఉన్న భూ సమస్యలను పరిష్కారం కోసం రైతులు ఇచ్చిన పత్రాలను రెవెన్యూ సిబ్బంది స్వీకరించారు. అదేవిధంగా గ్రామంలోని సర్వే నంబర్ 276 ఉన్న కొండయ్య భూములను గత 30 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన 34 మంది రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని కొండయ్య కుంట భూములను రెగ్యులరైజ్ చేయాలని రైతులతో కలిసి అశోక్ సాదుల వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుష్మ, గ్రామ రైతులు నల్ల బాలయ్య, సాదుల భాస్కర్, పోతరాజు బాలేష్, నిరుడి బాలేష్, సహదేవ్, లచ్చయ్య, దుర్గయ్య,శివరాములు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ ఎంపికలో పాల్గొన్న బాలబాలికలు

విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

సిద్దిపేట రూరల్, జూన్ 10, ప్రభాతవార్త:

జిల్లా కేంద్రంలోని స్విమ్మింగ్ పూల్‌లో మంగళవారం జిల్లా క్రీడా అధికారి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ బాల బాలికల ఎంపికలు విజయవంతంగా ముగిశాయి. స్విమ్మింగ్ పూల్ ఎంపికలలో బాల బాలకలు ఉత్సహంగా పాల్గొన్నారు. ఎంపికలలో 5 యేండ్ల నుంచి 16 యేండ్లలోపు బాలబాలికలు 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్‌పూల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు బర్ల మల్లికార్జున్, సిటిజన్‌క్లబ్ అధ్యక్షులు రమేష్, కార్యవర్గ సభ్యులు,డివైఎస్ఓ సిబ్బంది, యువజన నాయకులు రాజుగౌడ్ దాతలు శేఖర్,రుక్మిణిరెడ్డి, పద్మరవీందర్, సిటిజన్‌క్లబ్ సహకారంతో మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాల్గొంటారని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ పూల్ యాజమాన్య సభ్యులు పోతుల మహేష్, రాజలింగం, గోపినాథ్,మహేష్, ధరావత్ రమేష్, ఫిజియో మహేష్, అశోక్, వేణు, కనకయ్య, రవి, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

-ప్రధానోపాధ్యాయురాలు మంజుల

గజ్వేల్ టౌన్, జూన్ 10, ప్రభాతవార్త:

ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలతో కూడిన మెరుగైన విద్యను అందిస్తున్నట్లు పల్లెపహాడ్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల తెలిపారు. మంగళవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామంలో బడిబాటకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మంజుల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతల గురించి తల్లిదండ్రులకు, గ్రామస్తులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు పోటీతత్వం పెంపొందుతుందని, నిత్యజీవితంలో తలెత్తే సమస్యలను ఎలా అధిగమించాలో ప్రభుత్వ పాఠశాలల్లో నేర్పిస్తామన్నారు. 90 శాతం ఉద్యోగాలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికే వస్తున్నాయని, డబ్బులు పెట్టి కొనే విద్య మనకెందుకని, ప్రైవేట్ విద్యపై తల్లిదండ్రులు, ప్రజలు మోజు వీడాలన్నారు. ఆరుగాలం కష్టపడి సంపాదించిన డబ్బును వృధా చేసుకోవద్దన్నారు. ఈ విద్యా సంవత్సరంలో యూకేజి నుంచి 7వ తరగతి వరకు పిల్లలకు ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ప్రభావతి, ఆర్.రేణుక, బి.గీతామాధురి, సిహెచ్.శ్వేత, శ్రీకరి, తల్లిదండ్రులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

పాఠశాలలో పారిశుధ్యతకు పెద్దపీట వేయాలి..

పాపన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త:

పారిశుధ్య కార్మికులతో పాటు మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పాఠశాల పరిసరాలతోపాటు వంటలవిషయంలో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన పాపన్నపేటలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల పారిశుధ్య కార్మికులతోపాటు, పాపన్నపేట కాంప్లెక్స్ పరిధిలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ఈ ఏడు ముందుగానే వచ్చినందున పిచ్చి మొక్కలు, గడ్డి చెత్తచెదారాన్ని తొలగించి పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పారిశుద్ధ్య కార్మికులపై ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న 500 మంది రైతులు

సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో 5 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు వ్యవసాయ విస్తీరణ అధికారి భాస్కర్ తెలిపారు. గ్రామంలోని రైతువేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రీయను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నేటి వరకు 900 మంది అన్నదాతలు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఏఈఓ భాస్కర్ వివరించారు. ప్రభుత్వం రైతులకు త్వరలోనే ఫార్మర్ ఐడి కార్డును జారీ చేయనున్నట్లు భాస్కర్ వివరించారు.

పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

-మండల విద్యాధికారి సునీత

వర్గల్, జూన్ 10, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించాలని వర్గల్ మండల విద్యాధికారి సునీత తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వంట కార్మికులకు, పారిశుద్ధ్య కార్మికులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సునీత మాట్లాడుతూ వంట కార్మికులు అందరూ వంట చేసేటప్పుడు సరైన పద్ధతులు పాటిస్తూ వంట పాత్రలు శుభ్రంగా ఉండేవిధంగా వంట చేసే కూరగాయలు ఒకటికి రెండుసార్లు శుభ్రచేసి వంట చేయాలని తెలిపారు. అదేవిధంగా పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు పిల్లలకు సంబంధించిన మంచినీటి సౌకర్యం సక్రమంగా ఉండేవిధంగా, పిల్లలు చేతులు కడుక్కునే దగ్గర వాష్ బేసిన్ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాలల్లోని మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కనకరాజు, కృష్ణ సౌజన్య, సుధారాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది, వంట కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్, బేకరీలకు మున్సిపల్ నోటీసులు

హోటల్ యజమానికి నోటీసులు అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 10, ప్రభాతవార్త ః

ఈవర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని హోటల్స్ ఫాస్ట్‌ఫుడ్, బేకరీ, టిఫిన్ సెంటర్లకు మున్సిపల్ సిబ్బంది నోటీసులు అందించారు. మున్సిపల్ కమీషనర్ దేవేందర్ ఆదేశాల మేరకు మంగళవారం నాడు పట్టణంలోని పలు ఆహార సంబంధ వ్యాపారులకు నోటీసులు అందించి, పలు సూచనలు చేశారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజు ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉండాలని, ఈ విషయంలో యాజమాన్యాలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, వార్డు అధికారులు ఎల్లయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర స్థలాలలో సిసి కెమెరాల ఏర్పాటు

జిన్నారం, జూన్ 10, ప్రభాతవార్త:

మండలంలో శాంతి భద్రతల దృష్ట్యా వివిధ కుల, మతాలకు చెందిన పవిత్ర స్థలాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నయీముద్దీన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని గుడులు, మసీదులు, చర్చిలు మరియు ఇతర కుల సంఘాల వద్ద అత్యాధునిక హైరెజల్యూషన్ సిసి కెమెరాలు మరియు కనీసం 1నెలరోజుల రికార్డింగ్ సామర్థంతో కూడిన డీవీఆర్ లు అత్యవసరంగా ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇది ఆయా మత సంఘాల కమిటీ ఇన్‌చార్జ్‌ల బాధ్యత అని అన్నారు. సిసి కెమెరాలు నేరాలను నివారించడంలోనే కాదు, జరిగిన నేరాలను ఛేదించడంలో కూడా ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. ఒకరి మత సాంప్రదాయాలను మరొకరు గౌరవించినప్పుడే మత సామరస్యం నెలకొంటుందని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించవలసిందిగా సూచించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ప్రజలను రెచ్చగొట్టే విధంగా తప్పుడు ప్రచారాలు చేస్తూ.., ప్రజాశాంతికి భంగం కలిగిస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని, అట్టి వ్యక్తులపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తే సంఘటనలు ఎదురైనప్పుడు ఎంటనే పోలీసు స్టేషన్‌లో సమాచారం అంధించాలే గాని ఎవ్వరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యల చేసినా, సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టినా చట్టరిత్య కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

విజయవంతంగా ముగిసిన ఎఫ్‌డిపి

పటాన్‌చెరు,జూన్ 10,ప్రభాతవార్త:

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో కంప్యూటర్ ఆర్గనైజేషన్, ఆర్కిటెక్చర్ పై నిర్వహించిన వారంరోజుల అధ్యాపక వికాస కార్యక్రమం (ఎఫ్ డీపీ) విజయవంతంగా ముగిసింది. స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధస్సు డేటా సైన్స్ (ఏఐ డీఎస్) విభాగాలు సంయుక్తంగా ఈ ఎఫ్డీపీని హైబ్రిడ్ విధానం (ఆన్ లైన్, ఆఫ్ లైన్)లో నిర్వహించి, గీతం మూడు ప్రాంగణాల ఆచార్యులకు తగిన మార్గనిర్దేశనం చేశారు. ఐఐటీ మద్రాసు ప్రొఫెసర్ మధు ముత్యం, మహీంద్రా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ భార్గవ రాజారాం, డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆలపాటి వంటి ప్రముఖ నిపుణులు (రిసోర్స్ పర్సన్లు) విస్తృత శ్రేణి అంశాలను వారికి విశదీకరించారు. వీటిలో హార్డ్ వేర్ ఫండమెంటల్స్, మెయిన్ మెమరీ ఆర్కిటెక్చర్, ఇన్ స్ట్రక్షన్ లెవల్ ప్యారలలిజం, క్యాచి మేనేజ్మెంట్, సిస్టమ్ ఆప్టిమైజేషన్ టెక్నిక్ వంటివి ఉన్నాయి. వాటిపై లోతైన అవగాహన ఏర్పడేలా అభ్యాస అనుభవాన్ని గీతం అధ్యాపకులలో వారు మెరుగుపరిచారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, సీఎస్ఈ డీన్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ శాంతి చిలుకూరి, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, ఏఐ డీఎస్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శిరీష నేతృత్వంలో, డాక్టర్ యు.శ్రీనివాసరావు, శ్రీసౌమ్యల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. ఈ వారంరోజుల అధ్యాపక వికాస కార్యక్రమంలో గీతం హైదరాబాదు, బెంగళూరు, విశాఖపట్నం ప్రాంగణాలలోని 70 మంది అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది ఆయా ప్రాంగణాల మధ్య సమన్వయ సహకారాలతో పాటు విద్యాభివృద్ధిని కూడా పెంపొందించింది అనడంలో అతిశయోక్తి లేదు.

నర్సాపూర్ రైతువేదికలో రైతునేస్తం

నర్సాపూర్ జూన్ 10, ప్రభాతవార్త:

నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతు నేస్తం (వీడియో కాన్ఫరెన్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ అండ్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాజేందర్ రెడ్డి రైతులకు సోయాచిక్కుడు పంట సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మోజర్ల ఉద్యానవన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె శ్రీనివాస్ వాన కాలానికి అనువైన కూరగాయల విత్తనాల గురించి తెలియజేశారు. ఏవిధంగా సాగుచేయాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కె.లక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు పలువ్యాధులు సంక్రమిస్తాయి అన్

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి

ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నేతలు, ఎంపిటిలు

న్యాల్‌కల్, జూన్ 10, ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతున్నాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేజింతల్, న్యామతాబాద్, రాంతీర్థం, హుసెళ్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి ఎంపిటి సౌజన్యతో కలిసి లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలను అందించి ఇళ్ల నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీకారంచుట్టారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలు మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చామల జీవన్‌రెడ్డి, నాయకులు బలరాంరెడ్డి, విఠల్, అప్పారావు పాటిల్, రేజింతల్ శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్, సిరాజ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

-భూ నిర్వాసితులతో చంద్రశేఖర్‌రెడ్డి

సమావేశంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి వ్యవసాయ భూములు కేటాయించిన రైతులకు కాంగ్రెస్‌ప్రభుత్వం అండగా ఉంటుందని డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని ఎనికేమురి, వాసర్ గ్రామాల రైతులతో చంద్రశేఖర్‌రెడ్డి సమావేశం అయి భూములు కేటాయించిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు సర్దార్, శివాజీ పాటిల్, బాల్‌రెడ్డి, రాజుపాటిల్, వెంకటరెడ్డి, ప్రకాష్‌పాటిల్, గంగాధర్, జగదీష్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో గాలి దుమారం బీభత్సం

-నేల వాలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

గాలిదుమారానికి నేల వాలిన చెట్లు విద్యుత్ స్తంభాలు

సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ముబారక్‌పూర్, అంతర్గాం, గరిడేగాం, బొక్కస్‌గాం, పొట్‌పల్లి తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులతో ఉరుములు ఉరుముతూ మేఘాలు గర్జిస్తూ భారీవర్షం కురియడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పెద్ద ఎత్తున కురుస్తున్న వర్షంతో విద్యుత్ సరఫరా ఆగిపోవడం, ఇళ్లపై ఉన్న రేకులు పతంగుల్లా ఎగిరి పోవడంతో ప్రజలు భయాందోళనలతో రాత్రి గడపాల్సి వచ్చింది. సిర్గాపూర్‌లో 24.2 వర్షపాతం కురిసిందని రెవిన్యూ రికార్డులు ధృవీకరిస్తున్నాయి.

వంతెనపై నిలిచిన నీరు-ప్రయాణానికి తప్పని పాట్లు

లచ్చునాయక్ తండా శివారులో వంతెనపై నిలిచిన నీటి దృశ్యం

సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

మండల పరిధిలోని లచ్చు నాయక్ తండా శివారులో నల్లవాగుపై నిర్మించిన వంతెనపై వర్షం నీరు నిలవడంతో అటుగా ప్రయాణించే ప్రయాణీకులు, వాహన చోదకులు పాట్లు పడాల్సి వచ్చింది. వంతెనను నాణ్యతగా నిర్మాణం పనులు చేయకపోవడంతోనే వంతెనపై నీరు నిలుస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం...

నల్లవాగు ప్రాజెక్టు నుంచి వ్యవసాయ పంటలకు సాగు నీరందించేందుకు నిర్మించిన ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో పేరుకుపోయింది. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తే కాని ప్రాజెక్టు నుంచి పంటల సాగుకు తాగు నీరు సరఫరా అయ్యే పరిస్థితులు ఉండవని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినందున సంబంధిత అధికారులు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని రైతులు వినతి చేస్తున్నారు.

సిర్గాపూర్‌లో ఉన్నతి శిక్షణ కార్యక్రమం ప్రారంభం

ఉన్నతి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ సత్తయ్య

కంగ్టి, జూన్ 10, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కంగ్టిలో మంగళవారం ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని ఇందిరా క్రాంతిపథకం కార్యాలయంలో ఎంపిడిఓ సత్తయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ సత్తయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 100రోజులు పనులుచేసిన కూలీలకు కుట్టుమిషన్‌లో ఒక నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్‌బిఐ రిసోర్స్ పర్సన్ నరసింహా శిక్షణ ఇస్తారని, సురేఖ సమన్వయం చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ సుభాష్, సిసిలు కాలప్ప, సంతోష్, శివశంకర్‌లతో పాటు 39మంది శిక్షణ పొందే ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో రైతులు ఆగం

కొండాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

నకిలీ విత్తనాలతో రైతులను ఆగంచేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.దశరథ్ అన్నారు. నకిలీ పురుగుల మందులు అమ్ముతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని మంగళవారం సిపిఐ రైతు సంఘం అధ్వర్యంలో తహసీల్దార్ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి ఆయన మాట్లాడుతూ మండలంలోని అమాయక రైతులను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాల వ్యాపారులు చెలరేగిపోతున్నారని వాపోయారు. కాలం చెల్లిన విత్తనాలను, పురుగుమందులను, నకిలీ విత్తనాలను అంటగడుతున్నారని ఆరోపించారు.

సిపిఐ రైతుసంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కొండాపూర్ మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు మూడు నెలలుగా పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదని అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు అందేలా చూడాలని కోరారు. వ్యవసాయ పంటల కాలం ఆసన్నం కావడంతో విత్తనాలు, ఎరువుల కొరతను డీలర్లు సృష్టిస్తారని రైతులను మోసం చేయకుండా వ్యవసాయశాఖ, పోలీసు, టాస్క్ ఫోర్స్ అధికారులు పిడియాక్ట్ నమోదుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రయ్య, అంజయ్య, రామస్వామి, మోగులయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

రోడ్డును నిర్మించారు-క్యూరింగ్ మరిచిపోయారు

-10 రోజులకే తేలిపోతున్న సిసి రోడ్డు

హౌజింగ్‌బోర్డు కాలనీలో క్యూరింగ్ చేయక తేలిపోతున్న సిసిరోడ్డు

సదాశివపేట, జూన్ 10, ప్రభాతవార్త:

అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ లాభాపేక్ష మూలంగా 10 కాలాల పాటు ప్రజలకు ఉపయోగంలో ఉండేలా రోడ్డును నిర్మించాల్సిన రోడ్డు 10 రోజులకే రోడ్డు తేలిపోతోంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో 10 రోజుల క్రితం నిర్మించిన సిమెంట్ రోడ్డును నిర్మించి వాటర్ క్యూరింగ్ కొరకు కట్టలను సైతం నిర్మించారు. కొత్తగా నిర్మించిన రోడ్డు పది కాలాలపాటు నాణ్యతగా ఉండేందుకు వాటర్ క్యూరింగ్ తప్పనిసరని అధికారులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రోడ్డుపై నీటి నిల్వ కోసం నిర్మించిన కట్టలు సైతం అంతంత మాత్రంగానే ఉండటంతోపాటు ఒక్కరోజు కూడా కట్టల్లోకి నీటిని వదలలేదని కాలనీవాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వార్డు కౌన్సిలర్ పదవిలో లేకపోవడంతో కాంట్రాక్టర్ తన ఇష్టారీతిగా వ్యవహరించడంతో రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగా మారిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వాటర్ క్యూరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందచేస్తున్న దృశ్యం

అల్లాదుర్గం, జూన్ 10, ప్రభాతవార్త:

అర్హులైన పేదవారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని మండలపరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఎన్.చంద్రశేఖర్, ఎంపిఓ ఆర్.లింగప్ప, పంచాయతీకార్యదర్శులు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బసన్నగారి బలరాం, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన వెంకట్‌రెడ్డికి సన్మానం

ఎస్ఐ వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

సిఐగా పదోన్నతి పొందిన సిర్గాపూర్ పోలీసు ఠాణా ఎస్ఐ వెంకట్‌రెడ్డిని మంగళవారం బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వెంకట్‌రెడ్డిని సన్మానించిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్‌పాటిల్, నాయకులు సందీప్ సేట్, రవీందర్, రాజా గౌడ్, నారాయణ, జబ్బార్, వాసీం, బాబు, సంజీవ్‌రావు తదితరులు ఉన్నారు.

ఈనెల 12 నుంచి 27 వరకు సిటీ పోలీసు యాక్ట్

-సిపి డా॥అనురాధ

సిద్దిపేట, జూన్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లా పోలీసు కమిషనరేట్‌లో ఈనెల 12 నుంచి 27 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సిపి డాక్టర్ అనురాధ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు, ర్యాలటీలు, సభలు, సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహించదలుచుకుంటే ముందస్తుగా సంబంధిత పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. బండ్ల పేరిట వివిధకారణాలను చూపుతూ బలవంతంగా సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం పాటుపడుతున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో డిజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు ఉన్నాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి డిజే సౌండ్ వినియోగిస్తే చట్ట ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మూతపడిన పాఠశాలలను వెంటనే ప్రారంభించాలి

-మట్టి మనిషి ఫౌండేషన్ చైర్మన్ పరశురాం

జగదేవ్‌పూర్, జూన్ 10, ప్రభాతవార్త:

గ్రామాల్లో మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను వెంటనే పునః ప్రారంభించాలని మట్టి మనిషి ఫౌండేషన్ చైర్మన్ కె.పరశురాం అన్నారు. మంగళవారం మండలంలోని నిర్మల్‌నగర్ గ్రామంలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదేవ్‌పూర్ మండలంలో కరోనా మహమ్మారి కంటే ముందు కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడేవని, కరోనా తర్వాత మండలంలోని నిర్మల్‌నగర్, రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పేద ప్రజలకు ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే స్థోమత లేకున్నా అప్పులుచేసి చదివించాల్సి వస్తుందని అన్నారు. రెక్కాడితే గానీ డొక్క నిండని ఎంతోమంది పేద పిల్లలు ఆర్థిక పరిస్థితి బాగోలేక అందుబాటులో ప్రభుత్వ పాఠశాలలు లేక చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని మూతపడిన పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా అవగాహన కల్పించి పాఠశాలలు పునః ప్రారంభించాలని అన్నారు.

ఘనంగా బంగారు మైసమ్మ వార్షికోత్సవాలు

బంగారు మైసమ్మను దర్శించుకుంటున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ టౌన్, జూన్ 10, ప్రభాతవార్త:

గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డులో గల పురాతన దేవాలయం మర్రిచెట్టు శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం పునర్నిర్మించి రెండు సంవత్సరాలు గడిచిన సందర్భంగా మంగళవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని తోరణాలు, ఆకులతో అందంగా అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేడుకలకు హాజరైన భక్తులు తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి...

బంగారు మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌లు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్, కమిటీసభ్యులు దుర్గాప్రసాద్, మధుసూదన్, కృష్ణమూర్తి, వెంకటలక్ష్మి, సరోజినిదేవి, శ్రీరాములు, శోభారాణి, తలకొక్కుల భాగ్యలక్ష్మి, స్వరూప, శ్రీలత, మణికాంత్, డాక్టర్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలను పరిశుభ్రం చేయించిన హెచ్ఎం

సదాశివపేట, జూన్ 10, ప్రభాతవార్త:

ఈ నెల 12వ తారీఖున విద్యా సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల పరిసరాలను, తరగతి గదులను, వసతి గృహం గదులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోజిస్ దగ్గరుండి పారిశుధ్య కార్మికులతో పరిశుభ్రం చేయించారు.

కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించిన కార్పొరేటర్

బొంబాయి కాలనీలో అధికారులతో కలిసి సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 10, ప్రభాతవార్త:

భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ, మ్యాక్ సొసైటీ, విద్యుత్ నగర్ కాలనీల్లో కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి జలమండలి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించి కాలనీల అభివృద్ధికి కాలనీ వాసులతో చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ బొంబాయి కాలనీలో నిర్మాణం చివరిదశలో ఉన్న రైతుబజార్‌ను పరిశీలించి పార్కింగ్‌లో గ్రిల్స్, గేట్ నిర్మాణానికి నిధులు మంజూరు అయినందున టెండర్ వేసి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని అధికారులకు సూచించామన్నారు. కమ్యూనిటీ హాల్‌కు ప్రహారి గోడ నిర్మాణంను త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులకు సూచించామన్నారు. మ్యాక్ సొసైటీలో నిర్మిస్తున్న పార్క్‌ను సందర్శించామన్నారు. విద్యుత్‌నగర్‌లో డ్రైనేజి సమస్య ఉందని, మ్యాన్ హోల్స్‌ని శుభ్రం చేసి అవసరమైతే కొత్త డ్రైనేజి పైప్‌లైన్ వేసేందుకు ప్రతిపాదనలు పంపాలని జలమండలి అధికారులకు సూచించామన్నారు. ఓపెన్ డ్రైన్ పనులకు ప్రతిపాదనలు పెట్టాలని ఇంజనీరింగ్ అదికారులకు సూచించారు. కాలనీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సింధూ ఆదర్శ్‌రెడ్డి కాలనీల వాసులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో జలమండలి డిజిఎం శివకృష్ణ, ఇంజనీరింగ్ బిఈ దేవేందర్, ఏఈ ఫైజల్, కాలనీల డైరెక్టర్లు, కాలనీల వాసులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పారిశుధ్య కార్మికులకు అవగాహన

సిర్గాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం పాఠశాల పారిశుధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ నాగారం శ్రీనివాస్ పర్యవేక్షణలో జిల్లా రిసోర్స్ పర్సన్ గోపాల్ పని ముట్ల ఉపయోగంపై ప్రత్యక్షంగా పనితీరును చూయించారు. ఈ నెల 12న విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్నందున మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా కార్మికులు తగు చర్యలు తీసుకోవాలని కార్మికులకు గోపాల్ సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి-రుణాలను ఒకే దఫాలో ఇవ్వాలి

-కాశీపూర్ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్

కంది, జూన్ 10, ప్రభాతవార్త:

ఈ నెల 14, 15వ తారీఖులలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా సామాజిక శిక్షణ తరగతులను సంగారెడ్డి పట్టణంలో నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాశీపూర్‌లో నిర్వహించిన సమావేశంలో అశోక్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4 లక్షల రూపాయల వరకు రుణాలు మంజూరు చేస్తామని దరఖాస్తులు అందుకున్నారని, అర్హులైనవారికి ఒకేదఫాలో రుణాలను అందచేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నందున సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా విద్యను అందుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు బి.కుమార్, సుదర్శన్, శ్రీశైలం, మల్లేశం, భాస్కర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

తూమునూర్‌లో రెవిన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

మనూర్, జూన్ 10, ప్రభాతవార్త:

గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనిత అన్నారు. మంగళవాం మండల పరిధిలోని తూమునూర్‌లో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో తహసీల్దార్ అనిత పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రైతులు అందచేసిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనోద్దిన్, గోపాల్, జైపాల్, విఠల్‌రెడ్డి, మాజీసర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, సంజీవ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారి పనితీరుపై రైతులతో విచారణ

వార్త ప్రభావం

పశువైద్యాధికారి పనితీరుపై విచారణ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కంగ్టి, జూన్ 10, ప్రభాతవార్త:

మండల పశువైద్యాధికారి ముస్తాక్ అలీ రైతులకు అందుబాటులో ఉండక, అనారోగ్యానికి గురైన పశువులు చికిత్సలకు నోచుకోక పోతున్న విషయానికి సంబంధించి ప్రభాతవార్త మే 27న ప్రచురితమైన వార్తా కథనానికి జిల్లా పశువైద్యాధికారి స్పందిస్తూ మంగళవారం విచారణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి గ్రామానికి చేరుకుని 15మంది రైతులతో పశువైద్యాధికారి విధి నిర్వహణపై విచారించారు. ఈ సందర్భంగా రైతులు పశువైద్యాధికారితో పడుతున్న పాట్లను విచారణ అధికారి దృష్టికి తీసుకుపోయారు. పశువుల చికిత్సకు మందులు అందించకపోవడంతో ప్రయివేటుగా డబ్బులుచెల్లించి తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. పశువులకు సరైన సమయాల్లో టీకాలు వేయరని ఆరోపించారు. ఈ సందర్భంగా విచారణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పశువైద్యాధికారి పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించడంతో పాటు సమయ పాలన పాటించడం లేదని రైతులు పేర్కొన్నట్లు పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో మందులు ఉండేలా చూడాలని, పశువైద్యాధికారి అందుబాటులో ఉంటూ పశువులకు చికిత్సలు అందించాలని రైతులు వినతి చేశారు.

-తడ్కల్ పశువుల ఆసుపత్రి పరిశీలన...

సిర్గాపూర్‌కు పశువైద్యాధికారి పనితీరుపై రైతులతో ప్రత్యక్షంగా విచారణ చేపట్టిన విచారణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని తడ్కల్ పశువైద్యశాలను సందర్శించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు దాస్, శ్రీనివాస్‌రెడ్డి, కాలే రాజు, సంజీవ్, నర్సింలు, గణపతి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట...

-సిడిపిఓ సరిత

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ సరిత

జగదేవ్‌పూర్, జూన్ 10, ప్రభాతవార్త:

అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల సంఖ్య పెంచేందుకు అమ్మ మాట.. అంగన్వాడీ బాట... అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిడిపిఓ సరిత అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన జగదేవ్‌పూర్ అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కవిత, విఓ శివలక్ష్మి, పోషణ్ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ కిరణ్, సెక్టార్ సూపర్వైజర్ భవాని, అంగన్వాడీ టీచర్ వాణి, సంతోష, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

-విద్యుత్ చీఫ్ ఇంజనీర్ కామేష్

జహీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:

విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు విద్యుత్‌పరమైన సమస్యలు ఉత్పన్నంకాకుండా అంకితభావంతో విధులు నిర్వహించాలని విద్యుత్‌శాఖ చీఫ్‌ఇంజనీర్ కామేష్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు (డిఈ, ఏడిఈ, ఏఈలు, విద్యుత్ సిబ్బంది)లతో పట్టణంలో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. విధి నిర్వాహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డిఈ ఎ.లక్ష్మీనారాయణ, ఆయా మండలాల విద్యుత్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.